క్లుప్తంగా

చెత్త సేకరణ పనులు తనిఖీ

నందలూరు : చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలని రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలీ సిబ్బందికి సూచించారు. బుధవారం నందలూరు పంచాయతీలో జరుగుతున్న చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రాలను ఆయన ఎంపీడీఓ సునీల్‌కుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ శానిటేషన్ సిబ్బంది, క్లాప్ మిత్రలకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి, నందలూరు పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, శ్రీనివాసులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'దళిత రణభేరి'లో పాల్గొనండి

వీరబల్లి : ఈనెల 24న విజయవాడలో జరిగే దళిత రణభేరి కరపత్రాలు బహుజన్ సమాజ్ పార్టీ అన్నమయ్య జిల్లా రాజంపేట ఇన్‌చార్జ్ వెంకటరమణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే దళితుల రణభేరి కార్యక్రమానికి దళిత బిడ్డలు తరలిరావాలని కోరారు. దళితులపై జరుగుతున్న దాడులు ఆగేంతవరకు బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయం సిద్ధించే వరకు బహుజనులంతా ఏకమై ఈ పోరాటాలను కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పెద్దివీటి నరసింహులు, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, బీఎస్పీ రాయచోటి అధ్యక్షులు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

పుల్లంపేట : మండల కేంద్రంలోని వనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికకు జిల్లా కార్యదర్శి రమణ మూర్తి, సీనియర్ నాయకులు సాంబశివరావులు పరిశీలకులుగా వ్యవహరించారు. మండల నూతన అధ్యక్షులుగా రఫీ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా మాధవ మూర్తి, గౌరవ అధ్యక్షులుగా వరదా రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి నలభై శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

ముగిసిన మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీ శివ నర్సింగ్ కాలేజీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా బుధవారం విజయవంతమైనట్లు జిల్లా అధికారి నాగార్జున తెలిపారు. ఈ జాబ్‌మేళాకు దాదాపు 300 మందికి పైగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 108 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ భాస్కర్, జేఈ హెచ్.దొణప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

రాజంపేట రూరల్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బి.వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో 100 నోట్ పుస్తకాలను మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని ఎంపీపీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణమూర్తి చేతులమీదుగా సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బి.రామచంద్రనాయుడు, సంయుక్త కార్యదర్శి టి.సుబ్బారావులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే చోరీల నియంత్రణ

సిద్దవటం : చోరీల నియంత్రణకు సిద్దవటం మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో బుధవారం రాత్రి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం తెలపాలన్నారు. కొత్త వ్యక్తులకు గృహాలు అద్దెకు ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించి వారి చిరునామా పూర్తిగా తీసుకోవాలని చెప్పారు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కొంతమంది వ్యక్తులపై నిఘా వేశామని, చోరీల నియంత్రణకు ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీసులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కేసులు

లక్కిరెడ్డిపల్లి : రైతులకు నానో, జీవన ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం మద్దిరేవుల గ్రామంలోని ఈడిగపల్లి సచివాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు చేపడతామని హెచ్చరించారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భూములు సారాన్ని కోల్పోతున్నాయని, అందుకే రైతులు సేంద్రియ, నానో ఎరువులను వినియోగించాలని సూచించారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. యూరియా ఎకరానికి 1.5 మూట మాత్రమే వాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, హార్టికల్చర్ అధికారి మల్లికార్జున, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణే కీలకం

- లేకుంటే దిగుబడిపై ప్రతికూల ప్రభావం
- యాజమాన్య పద్ధతులతో అధిక ప్రయోజనాలు
- అవసరం మేరకే మందులు వాడాలంటున్న వ్యవసాయ అధికారులు

రాయచోటి జగదాంబసెంటర్ : వరిసాగులో రైతులకు కలుపు తీత ప్రధానమైంది. సకాలంలో కలుపుతీత తీయడం ద్వారా నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులందరూ ఇటీవల ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటోంది. కలుపును వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరి పంటలో కలుపు నివారించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాగు చేసే పంటల్లో పెరిగే ఇతర గడ్డిమొక్కలనే కలుపు అంటారు. సాగుభూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంట కంటే త్వరితగతిన పెరిగి పోషకాలు, ఎరువులను స్వీకరించి దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపును నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు ఎరువులు, పురుగుమందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండించడంలో అధిక దిగుబడులు సాధించడంలో విఫలమయ్యే పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతులు ఉంటాయి. వీటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. కూలీల కొరత ఎక్కువ కావడంతో పాటు, కూలి రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంభిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కలుపు నివారణకు అనేక రసాయన మందులను పిచికారీ చేయిస్తున్నారు. హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా, రసాయన క్రిమిసంహారక మందులను అధికంగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏ విధమైన మందులు, ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే, కలుపును పూర్తిగా నిర్మూలించి, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కలుపు నివారణ.. అంతర కృషి

వరిసాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక మందులను వినియోగించాలి. వరినాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500 మి.లీ. లేదా ఆక్సాడయార్జిల్ 20 గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్ సల్ఫూరాన్ లేదా క్లోరిమ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలుపు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900 మిలీ పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నిర్మూలించబడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



వరి పొలంలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమిసంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో, ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగకపోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందును ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించరాదని, కలుపు నివారణకు ఎల్లప్పుడూ ఒకే మందు వాడరాదని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

యాజమాన్య పద్ధతులు కీలకం



కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటినప్పట్టి నుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

– నాగమణి, వ్యవసాయాధికారిణి, రామాపురం మండలం

దసరా సెలవులు పెంచాలి

రాయచోటి టౌన్ : దసరా సెలవులను పెంచాలని ఎస్‌టీపీ నాయకులు విజయవాడలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డిని కోరారు. బుధవారం ఆయన్ను అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం దసరా సెలవులను ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబర్ 02 వరకు ప్రకటించిందని, కానీ విజయవాడ కనకదుర్గమ్మ ఉత్సవాలు 22వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దసరా సెలవులు ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు పొడిగించాలని కోరారు.

పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నా పట్టదా?

లక్కిరెడ్డిపల్లి : పల్లెలు జ్వరాలు బారీన పడినా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు తప్పుబట్టారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాలలో తీవ్రమైన జ్వరాలు, వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ప్రజలు బాధ పడుతున్నా వైద్య సేవలు అందించాల్సిన వారి జాడ కానరావడంలేదన్నారు. ఇప్పటికే గ్రామాలలో ప్రతి ఇంటిలో విష జ్వరాలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీ వైద్యుల చుట్టూ తిరుగుతూ వేల రూపాయలు ఖర్చు చేస్తూ అప్పులపాలవుతున్నారని ఆవేదనను తెలియజేశారు. కేవలం ఏ జ్వరమో నిర్ధారించుకోవడానికి వివిధ రకాల టెస్టులంటూ జేబులను గుల్ల చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో వైద్య సేవలను పర్యవేక్షించాల్సిన జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి ఎక్కడా తనిఖీలు చేయకుండా నెలనెలా వారి వాహనాలకు రావాల్సిన బకాయిలు మాత్రం తీసుకుంటూ ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అనారోగ్యాల బారీన పడుతున్న గ్రామాల ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.ఓబులేశు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్దిగాళ్ల శ్రీనివాసులు

సుండుపల్లె.. జ్వరాలు ప్రబలె

సుండుపల్లి : మండలంలో విషజ్వరాలతో ప్రజలు కుదేలవుతున్నారు. వాతావరణంలో నెలకొన్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయి. విషజ్వరాల కారణంగా కుటుంబంలో ఒకరు జ్వరంబారిన పడితే చాలు చిన్నపిల్లల నుంచి పెద్ద వారి వరకు అందరికీ దగ్గు, ఒళ్లు నొప్పులు ప్రారంభమై తరువాత జ్వరానికి లోనవుతున్నారు. మండలంలోని ప్రతి ఒక్క వైద్యశాల జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాలకు పరిసరాలు అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాప్తి చెందడంతో విషజ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మండలంలోని ప్రతి ఒక్క గ్రామంలో చాలా వరకు వైరల్ ఫీవర్ల సంఖ్య ఎక్కువగా కనిపిస్తున్నాయి.



ప్రభుత్వాసుపత్రిలో బారులు తీరిన జ్వరపీడితులు

'నిరుద్యోగుల ఆవేదన' సదస్సును జయప్రదం చేయండి


రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ విజయవాడలో నిర్వహించే నిరుద్యోగుల ఆవేదన సదస్సు జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి జె.వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని శ్రీనివాస ఐటీఐ ఆవరణలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించి అన్ని ప్రాంతాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చెప్పారు. పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయాలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని, వాలంటీర్లను కొనసాగిస్తూ, అర్హతే ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువకులకు ఉచిత స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఉచితంగా మెటీరియల్ ఇవ్వాలని సూచించారు. జరగబోవు శాసనసభ సమావేశాలలో ఈ అంశాలపై చర్చించి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే విజయవాడలో నిర్వహించే నిరుద్యోగ ఆవేదన సదస్సును కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలిరావాలని పిలుపునిచ్చారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్

ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాజంపేట రూరల్ : మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి కూటమి ప్రభుత్వం వేల మంది ఆటోడ్రైవర్ల కడుపు కొట్టిందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.సికిందర్, ఆటోడ్రైవర్ల వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావులు మండిపడ్డారు. స్థానిక పాత బస్టాండు వైఎస్సార్ సర్కిల్‌లోని ఆటోయూనియన్ స్టాండ్ వద్ద బుధవారం ఈ నెల 16న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆటోడ్రైవర్లతో కలిసి సికిందర్ ఆవిష్కరించి మాట్లాడారు. కొన్ని వేల మంది జీవనోపాధి కోసం ఆటోలను నడుపుకుంటున్నారన్నారు. అటువంటి వారికి ఉచిత బస్సు పథకం తీరని నష్టం చేకూరుస్తోందని వాపోయారు. ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. అలానే ఎఫ్‌సీల కోసం ఆర్‌టీఓ కార్యాలయాలకు వచ్చే ఆటో డ్రైవర్లకు అధికారులు సహకరించాలని కోరారు. కాగా ఈ నెల 16న జరిగే ధర్నాలో ప్రతి ఆటో కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు రమణ, వెంకటప్రసాద్, మనోహర్, గణేష్, చందు, మణీ, వేంకటాద్రి, హరి, సురేష్ పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

ఎంపీ మేడాపై ఎల్లో మీడియా విష ప్రచారం

నందలూరు : ఉపరాష్ట్రపతి ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు చేయడాన్ని మండల వైఎస్ఆర్‌సీపీ యువజన నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎల్లో మీడియాలో వచ్చిన రోత రాతలు, కథనాలపై బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుట్ర పూరితంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై విషం చిమ్మే నైజాన్ని పచ్చ పత్రికలు ఇంకా వదిలించుకోలేదని పేర్కొన్నారు. వైఎస్ కుటుంబానికి మరీ ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉండే మేడా రఘునాథరెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని అవాస్తవాలు ప్రచురించడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. చంద్రబాబు ప్రలోభాలకు లొంగని కారణంగానే పచ్చ పత్రికలు అసత్య కథనాలు వండివారుస్తూ ఆయన్ను బదానం చేయాలని అనుకోవడం మూర్ఖత్వమే అవుతుందనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీకి ఉన్న ఎంపీలు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణకు ఓటు వేశారని, ఎన్నికలో క్రాస్ ఓటింగ్ జరిగితే అనుకున్న నెంబర్ కంటే ఎక్కువ ఓట్లు రాధాకృష్ణకు ఎలా పడ్డాయో చెప్పే సాహసం ఎల్లో మీడియా చేయలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఎల్లో పత్రికలు అసత్య వార్తలను పక్కనబెట్టి నిజాలు రాసేలా బుద్ధి మారాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మడిశెట్టి సుధాకర్, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె గ్రీష్మంత్‌రెడ్డి

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం

వీరబల్లి : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు రఘురామయ్య రాష్ట్రస్థాయి పురస్కారాన్ని సెప్టెంబర్ 5న సీఎం చంద్రబాబు చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన సభలో గాలివీటి వీరనాగిరెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, లివిన్ డయాగ్నస్టిక్ ఎండీ వివేకానందరెడ్డి శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశారని తెలిపారు. అన్నమయ్య జిల్లా ఆర్ఐఓ రవికుమార్ మాట్లాడుతూ రఘురామయ్య భవిష్యత్తులో జాతీయ అవార్డు అందుకోవడానికి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. మొదటగా కళాశాల సిబ్బంది రఘురామయ్యను గజమాల, శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, రఘురామయ్య, మిత్రులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'యూరియాతో అనేక దుష్ప్రభావాలు'

వీరబల్లి : యూరియా వినియోగం, పీఎండీఎస్ పద్ధతులతో అనే ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు తెలియజేశారు. బుధవారం మండలంలోని గడికోట, గుర్రప్పగారిపల్లి గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యూరియా వాడకం వల్ల ఆకులు మెత్తబడటం, పంటల్లో చీడపీడలు, తెగుళ్లు, పురుగులు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. అలానే భూమి సారం దెబ్బతినడమే కాక కాలుష్యం అధికమవుతుందన్నారు. అందువలన ప్రతిరైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, ముఖ్యంగా ప్రధాన పంట నాటే ముందు పీఎండీఎస్ వాడటం ద్వారా నేల సారవంతం పెరుగుతూ ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. నానో యూరియాను ప్రతి రైతు వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ ఖాజాబీ, వీఆర్‌ఓ లోకనాథ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులు సాధించేదాకా పోరాటం

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీఎంఎస్‌సీ 1966/12/5 (హెచ్) అనే రూల్ ప్రకారం వడ్డెర్ల కో ఆపరేటివ్ సొసైటీలకు 50 శాతం రిజర్వేషన్ కలిగి ఉందని ప్రభుత్వాలు, మైన్స్ శాఖ అధికారులు, పోలీసులు గమనించాలని వడ్డెర ప్రజాగళం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు సూచించారు. బుధవారం రాయచోటిలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు ఉన్న క్రషర్స్, పెట్టుబడిదారీ, రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు కొన్ని జీఓలను తగ్గించారని తెలిపారు. జిల్లా మైన్స్‌లో వచ్చే ఆదాయంలో 30 శాతం వడ్డెర్ల విద్య, వైద్యం, మహిళాభివృద్ధికి ఖర్చు పెట్టాలని నిబంధనలు ఉన్న ఎక్కడా కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమన్నారు. మనకు వచ్చిన హక్కుల సాధనకు, ఎస్టీ రిజర్వేషన్ పొందడంతోపాటు వడ్డెర్ల వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్క వడ్డెర సోదరుడు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ విషయంపై మన ప్రజాగళం రాష్ట్ర వ్యాప్తంగా వినిపించేలా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలియజేశారు.

ఎంబీఏ కెరీర్ విజయానికి కొత్త దశలు

రాజంపేట : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలోని మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నావిగేట్ యువర్ ఎంబీఏ కెరీర్ – లేటెస్ట్ టూల్స్, ట్రెండ్స్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ ల్యాండింగ్ ది రైట్ రోల్ అనే శీర్షికతో ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెనోడో కార్పొరేషన్ ఫైనాన్షియల్ మోడలింగ్ అండ్ రిపోర్టింగ్ సీనియర్ మేనేజర్ ఏవీ రాజేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంబీఏ విద్యార్థులు తమ కెరీర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, తాజా పరిశ్రమ ట్రెండ్లు, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన వ్యూహాలపై విలువైన సూచనలు అందించారు. అలాగే వ్యక్తిగత సామర్థ్యాలను పరిశ్రమ అవసరాలకు సరిపోల్చడం, డిజిటల్ టూల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను వారు ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఇ.సాయిబాబా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ నవనీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతొల్యంగా యూరియా వాడాలి

రాయచోటి టౌన్ : పంటల సాగులో సమతొల్యంగా యూరియా వాడాలని రాయచోటి మండల స్పెషల్ ఆఫీసర్ నాగభూషణం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం రాయచోటి అర్బన్ ప్రాంతాలలోని సచివాలయ, కాటిమాకకుంట గ్రామ సచివాలయంలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏంఏఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సరిపడా నత్రజనిని అందిద్దాం

సిద్దవటం : ఖరీఫ్‌లో వరి ఎక్కువ సాగు చేస్తున్నారని వ్యవసాయ అధికారులు తెలియజేశారు. బుధవారం మండలంలోని పొన్నటలు, జ్యోతి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు వి.వెంకట సుబ్బయ్యతో పాటు మండల వ్యవసాయ అధికారులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగులో నత్రజని ఎరువులు ఒక ఎకరానికి 90 కేజీల నత్రజని పంట కాలానికి సరిపోతుందని రైతులకు తెలియజేశారు. అనంతరం పొన్నటలు, జ్యోతి రైతు సేవా కేంద్రం పరిధిలో ఉండే వరిపంట పొలాలను పరిశీలించడం జరిగింది. అక్కడ ప్రధానంగా దోమపోటును, పొడతెగుళ్లను అలాగే ఆకునల్లి కూడా గమనించి నివారణ చర్యలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె రమేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి వై ప్రభాకర్ రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది హసీనా, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు శ్రేయస్కరం

సుండుపల్లె : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బంది పండించిన ఆకుకూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలతో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించాలని, రసాయనిక పురుగు మందులు లేని ఆహార పదార్థాలు వాడటం వలన మన ఆరోగ్యం కాపాడుకొంటామని వివరించారు. ఇందులో రాయచోటి డివిజన్ ఏడీఏ శ్రీలత, మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా, పి.ఆంజనేయులు, సీఆర్‌పీ ఆంజనేయులు, ఐసీఆర్‌పీలు రామచంద్ర, శివరాంప్రసాద్, వీరనాగయ్య, ఆత్మ సిబ్బంది, బీఆర్‌సీ ఓనర్ ఎస్.వెంకటయ్య, యూనిట్ ఇంచార్జీలు రాంమోహన్, ఆంజనేయులు, మోడల్ మేకర్ రామాంజనేయులు, ఐసీఆర్‌పీ, రైతులు పాల్గొన్నారు.